
# పెళ్ళిచూపులు

— పద్మప్రియ




వేసవికాలపు మధ్యాహ్నం రూమ్‌లో ఒంటరిగా పడుకుని కునుకుతీస్తున్న శంకరం 'టెలిగ్రామ్' అన్నకేకకి గాబరాగా లేచి కూర్చున్నాడు చప్పున లేచి చొక్కావేసుకుని తలుపుతీశాడు ఎండలో వచ్చినందుకు కాబోలు, టెలిగ్రామ్ తెచ్చినతని ముఖం చిటపటలాడి పోతోంది ముభావంగా సంతకం చేయించుకుని వెంటనే వెళ్ళిపోయాడు శంకరం అసలే ఖంగారు మనిషి అందుకే టెలిగ్రాం అనేసరికి భయపడిపోయాడు అందులో ఏముందో చూడటానికి కూడా అతనికి ధైర్యం చాలలేదు "నాన్నకి ఆ మధ్య బాగా జలుబుచేసి రెండు రోజులు మిరియాల కషాయంకూడా తాగాడు కొంపతీసి ఆయన కేమయినా అయిందో ఏమో అన్న ఆలోచన వచ్చింది 'ఛ అంతలోనే ఏమవుతుందిలే' అని గుండె దిటవు చేసుకుని టెలిగ్రాం విప్పాడు

పెళ్ళి చూపులు అరేంజి చేశాను వెంటనే బయల్దేరు" తండ్రి యిచ్చిన తంతి సారాంశం యిది!

విషయం అర్థంకాగానే శంకరానికి అంతదాకా తండ్రిమీద కలిగిన సానుభూతి ఒక్కదెబ్బతో ఎగిరిపోయి, విపరీతమయిన కోపం ముంచు కొచ్చింది

'ఈయన కసలు బుద్ధిలేదు, ఏదో కొంప మునిగి పోయినట్టు పెళ్ళిచూపులకోసం టెలిగ్రాం యివ్వాలా' అని తనలో తనే విసుక్కున్నాడు 'పైగా వెంటనే బయల్దేరాల్ట వెంటనే అంటే యిదేమయినా వక్కకొట్టు కెళ్ళి పచ్చి మిరపకాయలు తేవటమా?'

శంకరం ఆలోచనతోను, అశాంతితోను పడికొట్టుకుపోతుండగా మార్నింగ్‌షోకి వెళ్ళిన అతని రూమ్మేటు, కొలీగ్ అయిన చలపతి ఉస్సూరుమంటూ అప్పుడే లోపలికి అడుగుపెట్టాడు

శంకరం ముఖభావాలు గమనించకుండా కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకుంటూ-

"సినిమా అనుకున్నంత బాగుండలేదోయ్, నిమిషానికోపాట పెట్టి దుంపతెంచేశాడు ఫొటోగ్రఫీ మాత్రం ఎక్సలెంట్ సంభాషణలు అక్కడక్కడా బాగున్నాయి నటీనటులు యధాశక్తి నటించారు కానీ, డైరెక్షన్ బాగుండనప్పుడు ఏం లాభం? మొత్తంమీద ఒకసారి చూడవచ్చు అంటూ రివ్యూ రాస్తున్నట్టు గబగబా చెప్పేసి తలెత్తిచూసి ఉలిక్కిపడి

"అదేమిటి? టెలిగ్రామ్‌లా వుంది? ఎప్పుడొచ్చింది?నాకు కాదు కదా? అన్నాడు కలవరంగా

"నాకు పెళ్ళి చూపులు! మా నాన్న వెంటనే రమ్మని టెలిగ్రాం పంపాడు" నీరసంగానే వున్నా అందులో కొంత నును సిగ్గుకూడా ధ్వనించింది శంకరం గొంతులో

చలపతి, హుషారుగా ఈలవేసి "ఇంకేం? శుభవార్తే! వెంటనే బయల్దేరు మరి మీ వూరి ట్రెయిన్ ఇంకో రెండు గంటల్లో వుంది కూడాను అన్నాడు ప్రోత్సాహిస్తూ

"అది కాదురా ఇలా వున్నట్టుండి పెళ్ళి చూపులంటే నాకు ఏదోలా వుంది" గొణిగాడు శంకరం

"మొదటిసారి అనుభవం కదా, అలాగే వుంటుంది అయినా యిలాంటివి అన్‌ఎక్స్‌పెక్టెడ్‌గా వుంటేనే థ్రిల్లింగ్‌గా వుంటాయోయ్! ఓ ఏడాది తర్వాత ఫలానా రోజున మనకి పెళ్ళి చూపులు అని ఇప్పుడే తెలిసిందనుకో, ఏం సరదాగా వుంటుంది చెప్పు కాబట్టి ఏమీ సందేహించకుండా రెడీ అవ్వు"

సందేహించకు అన్నకొద్దీ శంకరానికి అవి ఎక్కువయ్యాయి "మొన్నే క్రాఫ్ చేయించుకున్నాను ఇలా బోడి మొహంతో వెళ్తే వాళ్ళేమనుకొంటారు?"

"దీనిక్కూడా ఎందుకోయ్ వర్రీ? గుండు చేయించుకోలేదు కదా, నామాట విని వెంటనే షాంపూతో తలంటుపోసుకో జుట్టు ఒత్తుగా వుండకపోతే అడుగు లేమరి తొందరగా"

"ఇంత క్రితమె భోంచేసాను, ఇప్పుడు తలంటు పోసుకుంటే ఏమీ అవదా?"

"తల బాగుపడటం తప్ప యింకేమీ అవదు నేను హామీ యిస్తున్నాను సరేనా?"

"ఇప్పుడు నేను వెళ్ళలేదనుకో ఏమవుతుందంటావ్?" స్నేహితుడేమ యినా సపోర్టు చేస్తాడేమో మానేద్దామన్న ఆశతో అడిగాడు శంకరం

"మీ నాన్న విషయం నీ కన్నా నీ ద్వారా నాకే ఎక్కువ తెలుసు నువ్వు వెళ్ళకపోతే తనే వచ్చి లాక్కెళతాడు"

నిజమే తండ్రి అంతటి ఘనుడే! శంకరానికి తండ్రి భయం ఎక్కువే ఆయన చాలా రిజర్వుడు మనిషి ఏ పనీ ఎవరికీ చెప్పి చేయటం, సలహాలడగటం ఆయనకి అలవాటు లేదు ఉన్నట్టుండి నిర్ణయాలు

తీసుకుంటాడు చాలా ఏళ్ళ క్రితమే భార్య పోవటం పిల్లలిద్దరూ చిన్నవాళ్ళవ్వటంవల్ల బహుశః ఈ రిజర్వుడు నెస్ సహజంగానే ఆయనకి అబ్బిందేమో!శంకరం కాసేపు ఆలోచించి వెళ్లటంకన్నా వెళ్లకపోవటంవల్ల వచ్చే నష్టాలు ఎక్కువ అని గ్రహించి,

సరే, నేను తలంటుపోసుకొస్తాను అని లేచాడు

వెరీగుడ్, పెళ్ళి చూపులంటే హుషారుగావుండాలి గానీ వధ్యశిలకి తీసుకుపోతూన్నట్టుగా వుండకూడదోయ్

అబ్బే అదేం కాదురా! నేను వూహించని దేదయినా హఠాత్తుగా ఎదుర్కోవలసి వస్తే ముందు నాకు ఏమీ తోచదు కాసేపటికి ఎడ్జస్టయి పోతా ననుకో అన్నట్టు, చలపతీ నేను స్నానం చేసి వచ్చేలోపు నీ బట్టల్లో నీకు నచ్చినవి రెండు మూడు జతలు ఏరి మంచం మీద పెట్టు అందులోంచి నేనొక జత ఎన్నుకుంటాను

అదేం? నీకు బ్రహ్మాండ మయినవి చాలా వున్నాయిగా?' చలపతి ఆశ్చర్యంగా అడిగాడు

అందులో ఏదీ నా స్వంత వ్యక్తిత్వంతో యిష్టపడి కొనుక్కున్నదిలేదు అన్నీ షాపువాడి మొహమాటంవల్ల కొనుక్కున్నవే అనేసి బాత్‌రూమ్‌లో దూరి, 15 నిమిషాల తర్వాత తల తుడుచుకుంటూ బైటకి వచ్చాడు శంకరం

ఈలోపు చలపతి కొన్ని దుస్తులు ఇస్త్రీ చేసేవాడిలా మంచం మీద పరిచి, శంకరం రాగానే,

చూడరా ఈ నీలం చొక్కా బాగుంటుందేమో అని చూపించాడు శంకరం మొహం చిట్లించి వద్దురా, ఆ నీలం చొక్కా చూస్తుంటే నాకెందుకో నీలి లిట్మస్ అన్న మాట గుర్తొస్తూ వుంటుంది అన్నాడు

పోనీ ఈ గంధం రంగు?

అది వేసుకుంటే మరీ గంధం గిన్నెలా వుంటానేమో

# పెళ్ళిచూపులు

ఈ తెల్ల చొక్కా ఎలావుంది?

అది రాత్రిళ్ళు వేసుకోటానికి కొనుక్కున్నట్టుగా వుంది

ఒరేయ్ అసలు నువ్వెళ్లాల్సింది పెళ్ళి చూపులకి కాదురా సైకియాట్రిస్టు దగ్గరికి విసుక్కున్నాడు చలపతి

అరగంట సేపు ఇద్దరూ తర్జన భర్జన జరిపి చివరికి నల్ల చుక్కలున్న గోదుమరంగు చొక్కా, నల్ల ప్యాంటు సెలెక్ట్ చేశారు దాంతో పాటు యింకో జతకూడా బ్రీఫ్‌కేస్‌లో పెట్టుకున్నాడు శంకరం బ్రష్ టూత్‌పేస్ట్‌తో పాటు చలపతి చూడకుండా స్నోబాటిల్ కూడా సర్దేశాడు

అద్దం ముందు నుంచుని తల దువ్వుకుంటూ నువ్వన్నది నిజమేరోయ్ ఇప్పుడు జుట్టు బాగానే వుంది అన్నాడు

నా బూట్లు కూడా వేసుకెళ్ళు నీకు సరిపోతాయి టక్ చేసుకుని అవి వేసుకుంటే దర్జాగా వుంటావు అని వెనకనించి చలపతి మరో సలహా యిచ్చాడు

సరే అన్నాడు వెంటనే అంగీకరిస్తూ

అన్నట్టు రెండు రోజులకి సి ఎల్ రాసి వెళ్లరోయ్! లేకపోతే మన సి యి గారు చంపేస్తాడు

ఓ అదొకటి వుంది కదూ మర్చిపోయాను అని శంకరం గబుక్కున చేతికందిన కాగితం తీసి, గబగబా రాయబోయాడు వెంటనే చలపతి దాన్ని లాక్కుని-

'నీకు బొత్తిగా బుద్ధిలేదురా, సరిగ్గా చూసుకునే రాయి ఇది కరెంటు బిల్లు అన్నాడు మందహాసంగా

అయ్యో అలాగా!అనిమరోతెల్ల కాగితం మీద లీవ్ అర్జిస్తూ లెటర్ రాసి, చలపతి చేతిలో కుక్కి, మళ్ళీ తలదువ్వుకోవటంలో నిమగ్నమయ్యాడు

మొత్తం మీద అతను తెమిలి బయల్దేరేసరికి 3 గంటలు అంది

విష్‌యూ బెస్టాఫ్ లక్ అని దీవించాడు చలపతి

* * *

అమ్మాయిని తీసుకొచ్చి ఎదురుగా కూర్చో-బెట్టారు శంకరం తలవంచుకుని కూర్చున్నాడు అమ్మాయి తండ్రి గంటసేపు బతిమాలాకా తలెత్తి చూశాడు వెంటనే కళ్ళు జిగేల్మన్నాయి ఆహా! ఎంతటి సౌందర్యరాశి? పాలు కారుతున్న చెంపల్ని ముందు చూడాలా? చిలిపిగా చూస్తున్న ఆ నీరజ నేత్రాల్ని ముందు చూడాలా? జరీ అంచు పట్టు పైటని చూడాలా? ముద్దు లొలుకుతున్న మువ్వల పట్టాల పాదాల్ని చూడాలా?

ఆమె అందానికి తట్టుకోలేక కళ్ళు మూసు-కున్నాడు

చూడండి మిస్టర్ మీ పేరు? ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు

పెళ్ళి కూతురు సూటిగా చూస్తూ అడుగుతోంది

నా నా నా పేరా? శంకరం

"మీ పేరు నాకు నచ్చలేదు మార్చుకుంటారా?

అయోమయంగా చూశాడు

"పెళ్లయ్యాక ఉద్యోగం" చేయాలనుకుంటున్నాను ఒకపూట వంట మీరు చేస్తారా?

తలూపాడు

"బట్టలు చాకలి కెయ్యటంనాకు యిష్టముండదు మీరే శ్రద్ధగా ఉతకాలి తెలిసిందా?

సరే

"ఇంకో విషయం నాకు ఎప్పుడైనా కాళ్ళు నెప్పులు పుడితే నొక్కాలి

"అలాగే

ఆమె వెంటనే లేచి శంకరం చెంప చెళ్ళు మనిపించి, "నీలాటి వ్యక్తిత్వంలేని మొగుడు నాకెందుకు?" అనేసి వెళ్ళిపోయింది

* * *

శంకరం ఉలిక్కిపడి కళ్ళుతెరిచాడు రైలు వేగంగా పయనిస్తోంది

మధ్యాహ్నం మంచి నిద్రలో లేవటంవల్ల రైలెక్కి సీటుకి ఆనుకుని కాస్త కళ్ళు మూయగానే నిద్ర ఈ కల! శుభమా అని పెళ్ళి చూపుల కెళ్తొంటే ఈ వెదవ కలేమిటో? విసుక్కున్నాడు


అతను రెండు గంటలు తను చూడబోయే పెళ్ళి కూతుర్ని వూహించుకుంటూ కాలక్షేపం చేయగానే స్టేషను వచ్చేసింది

ఇంటికి రిక్షా ఎక్కి వచ్చాడు తండ్రి ముందు వరండాలో కూర్చుని 'వచ్చావా అన్నట్టు ఓ చూపు విసిరేసి వూరుకున్నాడు చెల్లెలు ఆప్యాయంగా పలకరించి, మంచినీళ్ళు కాఫీ యిచ్చింది

ఆ రాత్రి భోం చేసి పడుకున్నాడన్న మాటే గాని తీయటి వూహలతో నిద్రరాలేదు శంకరానికి

* * *

**భోపాల్‌లోని** ఆంధ్ర సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో దసరాలలో జరిగిన శారదాదేవి త్రిరాత్రి **మహోత్సవముల** సందర్భంగా తీసిన అమ్మవారు శారదాదేవి ఫోటో శ్రీ జి రామమూర్తి (ప్రస్తుత కార్యదర్శి) శ్రీ కె వి భద్రయ్య (పూర్వపు కార్యదర్శి)గార్లని చిత్రంలో చూడవచ్చు



ఉదయం ఆరు గంటలకి లేచి, స్నానం ముగించాడు 9 గం కి చూపులని నాన్న వంటావిడతో అనటం విన్నాడు అందుకే తన గది తలుపులు బిగించుకుని 7 గం నుండే ముస్తాబు ప్రారంభించాడు పెట్టో వేసుకొచ్చిన స్నో ముఖానికి పట్టించి కాసేపు ఫ్యాను గాలికి ఆరనిచ్చాడు తర్వాత పౌడర్ దూదూపుగా అద్దుకున్నాడు తల దువ్వుకుని అద్దంలో మొహం యిటూ అటూ తిప్పి చూసుకున్నాడు ఒక వైపు నుంచి చూస్తే శోభన్‌బాబులా వున్నట్టు యింకోవైపు నుంచి చూస్తే రాజబాబులాగా వున్నట్టు అని"పిం-చింది 'ఛీ హెయిర్ స్టయిల్ బావుళ్లేదు అని విసుక్కుని తలంతా చెరిపేసుకుని మళ్ళీ దువ్వు-కున్నాడు అలా ఐదారు సార్లు దువ్వెనతో దువ్వు-కుంటేనేగాని అతకి సంతృప్తి కలగలేదు చలపతి యిచ్చిన బట్టలు తొడుక్కుని, బూట్లు, సాక్సు దరించి టక్ చేసుకుని మళ్లీ అద్దంలో చూసు-కున్నాడు వెనక చొక్కా సరిగ్గా అమిరిందో లేదో చూసుకుందామంటే మెడ నెప్పి పుడుతోంది తప్ప కుదరటంలేదు నానా తంటాలు పడి టక్ సరిచేసు-కుని, మళ్లీ రెండు మూడుసార్లు అన్ని కోణాల్లోనూ తన్ను తను పరిశీలించి చూసుకుని సంతృప్తిపడి, మంచం మీద అలవోకగా పడుకుని ఆలోచించ-సాగాడు

అమ్మాయి ఎలా వుంటుందో? పేరేమిటో? పాత పేరయితే ఒప్పుకోకూడదు నల్లగా వుంటే అసలొప్పుకోకూడదు ముక్కు మరీ సంపెంగలా లేక-పోయినా కనీసం సింహం ముక్కులా లేకపోతే చాలు కళ్ళు పద్మాలు కాకపోయినా ఏనుగువి కాకపోతే పర్వాలేదు

డిగ్రీ చదువుకుని వుంటే బాగుంటుంది సంగీత సాహిత్యాలు మొదలయిన కళలలో అభిరుచి కలిగినదో కాదో తెలుసుకోవాలి

అయినా, యిప్పుడిన్ని ఆలోచిస్తున్నాడుగానీ, అక్కడికి వెళ్లాక నోరు పెగుల్తుందో లేదో?

శంకరం ఆలోచనలలో తేలుతూ, గడియారం-తొమ్మిది కొట్టేసరికి ఉలిక్కి పడ్డాడు

అరే? తొమ్మిదయి పోయిందా? వీళ్లేమిటి యింకా తెమలలేదు అనుకుంటూ తలుపుతీసి హాలులోకి వచ్చాడు తండ్రి తాఫీగా చుట్ట కాల్చుకుంటూ కూర్చుని వున్నాడు కొంచెం ధైర్యంచేసి


ఏం నాన్నా ఎప్పుడు బయల్దేరటం?" అన్నాడు

ఆయన తలెత్తి చూసి-

మనం బయల్దేరట మెందుకు? వాళ్లే వస్తారు అన్నాడు

వాళ్ళు రావట మేమిటి? మనం కదా వెళ్లాల్సింది ఆశ్చర్యంగా అడిగాడు

ఆయన చిరాగ్గా "చదవేస్తే వున్నమతి పోవటమంటే యిదే! ఆడపిల్లని అక్కడికి తీసుకెళ్లి చూపిస్తామా? వాళ్లే వచ్చి చూస్తారు-గాని, ఆ మాత్రం తెలియదూ? అన్నాడు




ఆడపిల్లని చూపించటమా? ఏ ఆడపిల్ల?

ఇంకెవరు నీ చెల్లెలు

శంకరం నిశ్చేష్టుడయ్యాడు

ఏమిటీ? ఈ పెళ్లి చూపులు చెల్లిలికా?

ఏం? లేక పోతే నీ కనుకున్నావా? వెటకారంగా అడిగాడాయన శంకరం ఏడుపు మొహం పెట్టి, మరి టెలిగ్రాం అలా యిచ్చారో? అన్నాడు

ఎలా యిచ్చాను? పెళ్లి చూపులు అరేంజ్ చేశాను వెంటనే రమ్మన్నాను అంతేగా? పెళ్లి చూపులు నీకేనని అనుకోవటం నీ తెలివి తక్కువ-తనం ఈడొచ్చిన చెల్లెలు వుండగా నీకు పెళ్లి చూపులు అరేంజ్ చేసేంత చవటననుకున్నావా నన్ను? తీక్షణంగా చూశాడు తండ్రి

శంకరం షాక్కొట్టినట్టు నిలబడి పోయాడు నిన్న మధ్యాహ్నం నుంచి అతను కన్న కలలు, ఊహలు, చేసుకున్న ముస్తాబు అన్నీ తండ్రి ఒక్క క్షణంలో భగ్నం చేసేశాడు

నీరసం ముంచుకొచ్చి కుర్చీలో కూలబడ్డ శంకరం ఆ షాక్ నుంచి తేరుకొనేలోపే పెళ్లివారు రావటం, చెల్లిలికి పెళ్లి చూపులు, వాళ్ళు వెళ్లి పోవటం అన్ని జరిగి పోయాయి □